# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

JULY - 1999

# సంక్షిప్త వార్తలు

1999 జూన్ 3వ తేదీ గురువారం నాడు పాలకొల్లు సబ్బేవారి పేటలో సువార్త కూటము జరిగెను. సోదరులు జి.షడ్రక్ గారు వాక్యపరిచర్య చేయగా 6 గురు పురుషులు, ఇద్దరు స్త్రీలు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

ఆచంట క్రీస్తుసంఘ సువార్తికులు వయోవృద్ధులు పి.సామ్యేలు గారు పక్షవాతము వలన అస్వస్థతకు గురియై కొన్ని దినములు ఆసుపత్రిలో యుండి, ఇప్పుడు స్వగృహమునకు చేరుకొనిరి. ఆయన ఆరోగ్యం కొరకు ప్రార్థించండి.

జూన్ 24వ తేదీ గురువారం కృష్ణా - ఖమ్మం జిల్లాల సువార్తికుల సదస్సు గన్నవరం మండలం కేసరిపల్లిలో ఘనముగా జరిగెను. ఈ సదస్సుకు జాషువా గూటం గారు, వారి సతీమణి మరియు కుమారులు కూడ హాజరైరి. మరియు పలు గ్రామముల నుండియు, పట్టణముల నుండియు సువార్తికులు కూడి రాగా, "క్రొత్త నిబంధన ఆరాధనలో దేవుడు కోరు సంగీతము యేది ?" అను ప్రశ్న చర్చించబడెను.

విజయవాడకు సమీపముగా యున్న కేసరిపల్లి గ్రామములో 1979లోనే సోదరులు జె.సి. బెయిలీ గారు పునాది వేయగా అక్కడనున్న సంఘము ఒక చక్కటి ఆలయమును నిర్మించుకొని దేవునినారాధించుచున్నారు. మరియు సోదరులు పి.షడ్రక్ గారు ఉపాధ్యాయ వృత్తి చేసికొనుచు అక్కడ సువార్త ప్రకటించుచుండిరి. దరిమిలా ఆయన పదవీ విరమణ గావించి సువార్త కొరకు ఎక్కువ సమయాన్ని కేటాయించగలుగుచున్నారు.

సువార్తికుల సదస్సు సకాలమునకు సోదరులు పి.షడ్రక్ గారి తొలి పలుకులతో ఆరంభమాయెను. సోదరులు టి.ప్రసాదరావ్ గారు అధ్యక్షత వహించి సదస్సును చక్కగా నిర్వర్తించిరి నందిగామనుండి వచ్చిన జి.మార్కు గారు ప్రారంభ ప్రార్థన చేయగా, విజయవాడ నుండి వచ్చిన పెర్సీజాన్ గారు బైబిలు నుండి 100వ దావీదు కీర్తన చదివి వినిపించారు. ఇయ్యబడిన అంశమును యన్.ఆదాము (రెడ్డిగూడెం), కె.బాబూరావ్ (తక్కెళ్లపాడు,ఖమ్మం జిల్లా), జి.మార్కు (నందిగామ), ఓ.నాగేశ్వరరావ్ (రెడ్డిగూడెం), జాన్ రిక్కీ గూటం (కాకినాడ), కె.ఇశ్రాయేలు (కంభంపాడు), పి.అబ్రాహాము (ముత్యాలపాడు-విజయవాడ), బుర్రే యోహాను

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

**P.O. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884 - 63722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 19 | జూలై 1999 | సంచిక 12


## సంపాదకీయం

# పాప పురుషుడు

(The Man of Sin)

పరిచయము : గత సంచికలో మనము విశ్వాస భ్రష్టత్వమును గూర్చి కొంత తెలిసికొంటిమి. అది సంఘము క్రీస్తుయొక్క బోధనుండి తొలగిపోవుట మాత్రమే గాక విశ్వాస భ్రష్టత్వము వలన కలిగిన పరిణామము; ఈ లోకమును కంపింపజేయునంత ప్రాధాన్యమైనది: థెస్సలోనికయులకు అపొ.పౌలు వ్రాసిన రెండవ పత్రికలో ఈ విశ్వాసభ్రష్టత్వము దేవునియొక్కయు, క్రీస్తుయొక్కయు అధికారమును ధిక్కరించుట వలన కలుగునని అతడు హెచ్చరించాడు. అదొక గొప్ప పౌరోహిత్య పద్ధతి (ecclesiasticism) మరియు క్రైస్తవ మత కల్లోలము (Howard Page 28).

ఈ పాఠంలో పాపపురుషుడు అనబడే వానిని గూర్చి తెలిసికొనుటకు ప్రయత్నించెదము. అతడు క్రీస్తు విరోధియని లేఖనములు ఘోషించుచున్నవి. పాపపురుషుని యొక్కయు, వేశ్యలకు తల్లియైన దానియొక్కయు (ప్రక 17:5) లక్షణములను గుణగణాలను పఠించుట ద్వారా చరిత్ర పుటలలో అతడెవరో, లేక అదెవరో సులభముగా గుర్తించగలము.

## పాప పురుషుడెవరు ?

థెస్సలోనికయలో యున్న క్రీస్తుసంఘము క్రీస్తుయొక్క రెండవ రాకడను గూర్చి గొప్ప ఆందోళన జెందియుండెను. అపొ.పౌలు వారికిట్లు తెలియజేసెను: "మొదట భ్రష్టత్వము సంభవించి నాశనపాత్రుడగు పాప పురుషుడు బయలు పడితేనే గాని ఆ దినము రాదు. ఏది దేవుడనబడునో, ఏది పూజింపబడునో దాని నంతటిని ఎదిరించుచు, దానికంతటికి పైగా వాడు తన్ను తానే హెచ్చించు కొనుచు, తాను దేవుడనని తన్ను కనుపరచుకొనుచు, దేవుని ఆలయములో కూర్చుండును గనుక ఏ విధముగానైనను ఎవడును మిమ్మును మోసపరచ నియ్యకుడి. నేనింక మీ యొద్ద నున్నప్పుడు మీతో చెప్పినది మీకు జ్ఞాపకము లేదా ?కాగా వాడు తన సొంత కాలమందు బయలు పరచబడవలెనని వానిని అడ్డగించునది యేదో అది మీరెరుగుదురు. ధర్మవిరోధ సంబంధమైన మర్మము ఇప్పటికే క్రియ చేయుచున్నది గాని యిదివరకు అడ్డగించుచున్నవాడు మధ్యనుండి తీసివేయబడు వరకే అడ్డగించును. అప్పుడా ధర్మవిరోధి బయలు పరచబడును. ప్రభువైన యేసు తన నోటి యూపిరి చేత వానిని సంహరించి తన ఆగమన ప్రకాశము చేత నాశనము చేయును. నశించుచున్న వారు తాము రక్షింపబడుటకై సత్యవిషయమైన ప్రేమను అవలంబింపకపోయిరి గనుక, వాని రాక అబద్ధ విషయమైన సమస్త బలముతోను, నానా విధములైన సూచక క్రియలతోను, మహత్కార్యముల తోను, దుర్నీతిని పుట్టించు సమస్త మోసముతోను, నశించుచున్న వారిలో సాతాను కనుపరచు బలమును అనుసరించి యుండును" (2థెస్స 2:3-10).

ఈ లేఖన భాగంలో పాపపురుషుడు నాశన పాత్రుడగు పాపపురుషుడనియు, ధర్మవిరోధి అనియు, దుర్నీతి పరుడనియు, వాని రాక సాతాను కనుబరచు బలముననుసరించి యుండుననియు, దేవునినే ఎదిరించుచు దేవుని స్థానముననే దేవుని ఆలయమున కూర్చుండు వాడనియు, తానే దేవుడనని చెప్పుకొనుననియు వర్ణించబడెను. గనుక యితడు ఒక వ్యక్తి అయినా అయ్యుండాలి, లేదా పరంపరగా వచ్చు వ్యక్తులైనా అయ్యుండాలి.

యితడొకే వ్యక్తి అనే భావముపై ప్రఖ్యాతిగాంచిన Pulpit Commentary యిట్లు చెప్పుచున్నది :"నాశన పాత్రడగు పాప పురుషుని గూర్చి అపొ.పౌలు చేసిన ప్రవచనము సంఘ పెద్దలను బహుగా కలవరపరచినది. అతనిని గూర్చి వారి వ్రాతలలో పలుమారులు ప్రస్తావించుట జరిగినది. వారందరు ఈ విషయంలో చెప్పుకోదగ్గ ఏకీభావము కలిగియుండిరి. ఈ ప్రవచన నెరవేర్పు యింకా భవిష్యత్తులోయున్నదని, పాపపురుషుడొక వ్యక్తియని, క్రీస్తువిరోధియని, వానిని అడ్డగించునది రోమా సామ్రాజ్యమని వారు సాధారణంగా భావించిరి".

గనుక ఆదిమ సంఘపెద్దలు (తండ్రులు) పాపపురుషుడొక వ్యక్తియని, చరిత్రలో ఏదో ఒక ప్రత్యేక సమయంలో భవిష్యత్తులో అతడుద్భవించునని వారు నమ్మియుండిరి.

**పరంపరగా వచ్చు వ్యక్తులు :** ఈ భావమును పాప పురుషుడొకే ఒక వ్యక్తి కాదుగాని అవిధేయతను ప్రదర్శించు ఒక ప్రణాళిక. అది దేవుని క్రమమును నెట్టివేసి, దాని సొంత క్రమమును దాని స్థానములో యుంచుటకు ప్రయత్నించును. శాసించే అధికారము దేవుడు తనకే ఉంచుకొనియుంటే పాపపురుషుడు ఆయధికారమును తన స్వంతము చేసికొనజూచును. తద్వారా తన్ను దేవునిగా కనబరచుకొని దేవుని స్థానముననే కూర్చుండును. ఇంకోమాటలో యిది యేసుక్రీస్తును ప్రభువుగాను, యజమానిగాను తిరస్కరించుటయే (యూదా:4-6;2పేతురు 2:1)

**మొదటి సంఘసంస్కర్తలు :** పాపపురుషుడు ఒకే ఒక వ్యక్తికాదు గాని పైన చెప్పబడిన విధంగా పరంపరగా వచ్చు ఆయా వ్యక్తుల పద్ధతియని సంఘ సంస్కర్తలు సాధారణంగా భావించిరి. మార్టిన్ లూథర్, జాన్ కేల్విన్, జ్వింగ్లీ, మెలాంగ్‌తన్, బేజా, బ్యూకార్, క్రేమర్, రిడ్లే, లేటిమర్, హూపర్ మరియు జ్యూవెల్ అనువారు ఇట్టి భావమును కలిగియుండిరి. క్రీస్తు సువార్తను విడిచిపెట్టి మానవుల పారంపర్యాచారములకు నెలవీయుట వలనను, పోపుల యొక్క అవినీతివలనను విశ్వాస భ్రష్టత్వము సంభవించినదని వారు తలంచిరి. పాపపురుషుడను వాడు ఒకే ఒక్కడు కాదుగాని ఒకని వెంబడి మరొకడు ఆ స్థానమునధిష్ఠించు ఒక పద్ధతి యని వారు భావించిరి. అతడు క్రీస్తువిరోధి. అతనిని అడ్డగించునది రోమా సామ్రాజ్యమే. రోమా సామ్రాజ్యము పతనమవుటవలన పోపుల పద్ధతి బలము పుంజుకొనినది (Phillips Page 439).

లూథరన్ సంఘము యొక్క విశ్వాస ప్రమాణము (Confession of Faith) ఈ భావమును బలపరచుచున్నది.

వెస్ట్ మినిస్టర్ విశ్వాసప్రమాణము (West minister Confession of faith) కూడ పోపు ఆ పాపపురుషుడని, క్రీస్తువిరోధియని వక్కాణించుచున్నది : "క్రీస్తుతప్ప సంఘమునకు శిరస్సుగా వేరొకడు లేడు. రోమా పట్టణములో యున్న పోపు క్రీస్తు సంఘమునకు ఏ విధముగాను శిరస్సు కాలేడు.అతడు క్రీస్తువిరోధి, నాశనపాత్రుడగు పాపపురుషుడు. క్రీస్తుకు విరోధముగా దేవునిదైన ప్రతిదానిలోను తన్ను తాను హెచ్చించుకొనియున్నాడు" (WCF 25:6)

1611లో కింగ్‌జేమ్స్ బైబిలు తర్జుమా దారులు పోపే ఆ పాపపురుషుడని వక్కాణిస్తూ, సత్యము విషయమై పోరాడుచున్న కింగ్‌జేమ్స్‌ను కొనియాడారు. ఇంగ్లాండ్ రాజైన జేమ్స్ "పాపపురుషునికిచ్చిన దెబ్బవలన అతడు మరల తేరుకొనుట" కష్టమని వారు నుడివిరి.

తదుపరి సంఘ సంస్కర్తలగు హూకర్, హర్డ్, న్యూటన్, టర్రెటిన్, బెన్సన్, బెంజెల్, డూడ్‌రిడ్జ్, మేక్‌నైట్, మైకేలిస్, ఇల్లియట్ మరియు వర్డ్స్ వర్త్‌లు ఈ యభిప్రాయముతో ఏకీభవించిరి.

పోపే పాపపురుషుడని భావించేవారి దృక్కోణముతో చరిత్ర కూడ ఏకీభవించు చున్నట్లున్నది. రోమా సామ్రాజ్య చక్రవర్తి తన రాజ్యముపై ఏలుబడి చేసినంత కాలము, వేరొక శక్తి తల యెత్తే అవకాశము లేకపోయెను. అయితే ఆ అడ్డగించే శక్తి (రోమాసామ్రాజ్యము) తొలగిపోగానే నాశన పాత్రుడగు పాపపురుషుడు బయలు పరచబడెను.

## పాపపురుషుని లక్షణములు పోపులో యున్నవా ?

విశ్వాస భ్రష్టత్వమును గూర్చి ముందుగనే ప్రవచింపబడెను : కేథలిక్కుల మతములో పవిత్రమైన క్రీస్తు సువార్తకు బదులు మానవ పారంపర్యాచారములకు ప్రాధాన్యత ఇయ్యబడెను. ఇదొక గొప్పమార్పు. ఉదా : పాపవిమోచనకొరకు మృతులు కనిపెట్టేస్థలము (Purgatory) ఉన్నదని, ప్రభురాత్రి భోజనంలో రొట్టె ద్రాక్షారసము నిజముగా క్రీస్తు శరీరము, రక్తముగా మారునని (Transubstantiation), జపమే యాగమని (Sacrifice of Mass), మరియను యితర పరిశుద్ధులను పూజింపవలెనని చేయు బోధలన్నీ మానవకల్పితములే.

దేవునిదైన ప్రతిదానిపైన తన్నుతాను హెచ్చించుకొనుచు పాపపురుషుడు దేవునినే ఎదిరించును : ఇంకోమాటలో అతడు తనకు తానే ఆరాధనామూర్తిగా ఎంచుకొనును.

- పోపు దైవాధికారమునకు, మానవాధికారమునకు అతీతుడుగా తన్ను తాను హెచ్చించుకొనును.
- అతడు "రాజులకు రాజు ప్రభువులకు ప్రభువు" అను బిరుదు ధరించు కొనును.

- యెషయా 49:23లో, "రాజులు... భూమిమీద సాగిలపడి నీకు నమస్కారము జేసెదరు, నీ పాదముల ధూళి నాకెదరు" అను మాటలు తనకు వర్తింపజేసు కొనును.
- అతడు సార్వజనిక బిషప్పుగా(Universal Bishop)తన్నుతాను ఎంచు కొనును.

పాపపురుషుడు దేవుని ఆలయములో కూర్చుండును, దేవునిగా కనబరచుకొనును:

- దేవుని ఆలయము లేక మందిరమే క్రీస్తుసంఘము (1తిమో 3:15).
- భూమి మీద దాని ఏకైక శిరస్సు తానేయనియు, క్రీస్తుయొక్క ప్రతినిధి ననియు (Vicar of Christ) పోపు ప్రకటించుకొనును.
- దైవిక శక్తి కలిగిన వాడనని తానే దేవుడనని అతడు చెప్పుకొనును :
  - అతడు పరిశుద్ధుడని, పొరబడనివాడని(Holy & Infallible) చెప్పు కొనును.
  - పాపములు క్షమించే హక్కు తనకు కలదని అతడు ఆరోపించు కొనును.
  - పరలోక రాజ్యము యొక్క ద్వారములు తెరిచే అధికారము, మూసే అధికారము తనకు కలదని చెప్పుకొనును.
- దేవునికి చెందవలసిన బిరుదులు తానే ధరించుకొనును :
  - అతని అనుచరులతని "మన ప్రభువును దేవుడైన పోపు" అని సంబోధింతురు.
  - అతడు "భూమి మీదనున్న మరొక దేవుడు" అని వర్ణించబడతాడు (Phillips Page 351
- అతడు ఎన్నిక కాగానే సెయింట్ పీటర్స్ చర్చిలో (రోమాలో) పెద్ద సింహాసనా సీనునిగా చేసి కార్డినల్స్ అందరు అతని ఆరాధింతురు.

పాపపురుషుని రాక సమస్త బలముతోను, నానా విధములైన సూచక క్రియలతోను, మహత్కార్యములతోను, సమస్త మోసముతోను సాతాను కనబరచు బలముతోను అనుసరించియుండును:

- పోపుల ద్వారా జరిగించబడుచున్నవని చెప్పబడుచున్న సూచక క్రియలను గమనించుము.

- పాపక్షమాపణ పత్రముల విక్రయము (Indulgences) మరియు పాపక్షమాపణ కొరకు మృతులు వేచియుండే స్థలమును (Purgatory) గూర్చిన అబద్ధ బోధలను గమనించుము.

- పవిత్ర ప్రతిమలు కదలుచున్నట్లు, మాట్లాడుచున్నట్లు, రక్తము కార్చుచున్నట్లు చెప్పబడే మోసకరమైన మహత్కార్యములను గూర్చి ఆలోచించుము.

- పవిత్ర అవశేషములు (Sacred retlics) ద్వారా కలుగునని చెప్పబడే మేళ్లను గూర్చి ఆలోచించుము.

- నేటికిని అద్భుతములు చేసే శక్తి తనకున్నదని రోమన్ కేథలిక్కు సంఘము ఆరోపించుకొనుచున్నదని గ్రహించుము.

విశ్వాస భ్రష్టత్వపు గురుతులు ముందుగనే చెప్పబడెను : **(1తిమో 4:1-3)**

- మోసపరచు ఆత్మలయందును, దయ్యముల బోధయందును లక్ష్యముంచుట.

- వేషధారణవలన అబద్ధములాడుట

- వివాహమును నిషేధించుట

- ఆహార వస్తువులను తినకూడదని నిషేధించుట

ఈ గురుతులన్నియు పోపుల పద్ధతిలో ఖచ్చితముగా కనబడుచున్నవి.

గమనిక : విశ్వాస భ్రష్టత్వపు గురుతులు రోమన్ కేథలిక్కు సంఘములోను,యితర సంఘములలోను కూడ గోచరమవుచున్నవి. ప్రొటెస్టాంటు సంఘములు అనేకములు ఈ గురుతులలో కొన్నిటిని కొద్దో గొప్పో ప్రదర్శించుచున్నవి. వాటిలో ప్రాధాన్యముగా బైబిలుకు వేరుగా పరిశుద్ధాత్మ మర్మయుక్తముగా నేరుగా పనిచేయు చున్నాడని నమ్ము సంఘములున్నవి. మరికొన్ని సంఘములు రోమన్ కేథలిక్కు సంఘము బోధననుసరించి కొన్ని మాంసాహారములను నిషేధించిరి.

అపొస్తలుల వేషము ధరించుకొనిన దొంగ అపొస్తలులు : "ఏలయనగా అట్టివారు క్రీస్తుయొక్క అపొస్తలుల వేషము ధరించుకొనువారై యుండి, దొంగ అపొస్తలులును మోసగాండ్రగు పనివారునై యున్నారు. ఇది ఆశ్చర్యము కాదు; సాతాను తానే వెలుగుదూత వేషము ధరించుకొనుచున్నాడు" (2కొరింథీ 11:13,14).

గమనిక : లేఖనముల సంగ్రహణమేమంటే ఎవడైనను అపొస్తలుడనని లేక అపొస్తలుల స్థానముననే పరంపరగా వచ్చిన అపొస్తలుడనని చెప్పుకొనిన యెడల అతడు క్రీస్తువిరోధి, మరియు సాతాను యొక్క పరిచారకుడు. అందువలన అపొస్తలుల స్థానముననే వచ్చిన వారమని చెప్పుకొనే పోపుల పద్ధతి అంతా లేఖనములలో ఉదహరించబడినట్లు హేయమైనది.

## వేశ్యలకు తల్లి యెవరు ?

ప్రకటన 17:3-7లో యోహానుచే చెప్పబడిన ప్రవచనము రోమాలో యున్న పోపుల పద్ధతికి వర్తించునని సంఘ సంస్కర్తలు, వ్యాఖ్యానకర్తలు భావించిరి. యోహాను ఇట్లు వ్రాసెను: "అప్పుడతడు ఆత్మ వశుడనైన నన్ను అరణ్యమునకు కొనిపోగా దేవదూషణ నామములతో నిండుకొని, యేడు తలలును పది

కొమ్ములును గల ఎర్రని మృగము మీద కూర్చుండిన యొక స్త్రీని చూచితిని. ఆ స్త్రీ ధూమ్ర రక్త వర్ణములుగల వస్త్రము ధరించుకొని బంగారముతోను రత్నములతోను, ముత్యములతోను అలంకరింపబడినదై ఏహ్యమైన కార్యములతోను తాను చేయుచున్న వ్యభిచార సంబంధమైన అపవిత్ర కార్యములతోను నిండిన యొక సువర్ణ పాత్రను తన చేత పట్టుకొనియుండెను. దానినొసట దానిపేరు ఈలాగు వ్రాయబడియుండెను-మర్మము, వేశ్యలకును భూమిలోని ఏహ్యమైన వాటికిని తల్లియైన మహాబబులోను. మరియు ఆ స్త్రీ పరిశుద్ధుల రక్తము చేతను, యేసు యొక్క హతసాక్షుల రక్తము చేతను మత్తిల్లి యుండుట చూచితిని. నేను దాని చూచి బహుగా ఆశ్చర్యపడగా, ఆ దూత నాతో ఇట్లనెను - నీవేల ఆశ్చర్యపడితివి? యీ స్త్రీని గూర్చిన మర్మమును, ఏడు తలలును పదికొమ్ములును గలిగి దాని మోయుచున్న క్రూర మృగమును గూర్చిన మర్మమును నీకు తెలిపెదను".

ఈలేఖన భాగముపై (Pulpit Commentary) పుల్‌పిట్ వ్యాఖ్యానము ఇట్లు చెప్పుచున్నది: "పోపుల రోమా మర్మయుక్తమైన బబులోననుటలో సందేహము యేమిలేదు". దిగువనీయబడిన **14** అంశములను ధ్యానించుము:

1 ఆ స్త్రీ మృగము మీద కూర్చుని యుండెను. మృగము ఆ స్త్రీకి మద్దతు యిచ్చుచున్నట్లుండెను (3వ వచనము). రోమాలోని పోపులు లౌకిక, ఆధ్యాత్మిక శక్తిని గలవారమని చెప్పుకొనుచుందురు. వారు తమ ఆదేశములు అమలు పరచబడుటకు గాను లౌకిక శక్తులపై ఆధార పడుదురు.

2. ఆమె ఆ మృగము మీద స్వారీ చేయును, దానిని ఏలుబడి చేయును. రోమన్ కేథలిక్కు సంఘము ఏ రాజకీయ శక్తిపై ఆనుకొనియుండునో దానినే లోబరచుకొన ప్రయత్నించును.

3. ఆమె విస్తార జలముల మీద కూర్చుని యుండెను (ప్రక 17:1). దాని

రాయబారులు భూమిపై యున్న ప్రతి జనాంగములకు వెళ్లుదురు.

4. అది భూ రాజులనేలును (18వ). కేథలిక్కుల పరిభాషలో "పవిత్రమాత" యొక్క ఆదేశములను అమలు పరచుటకు గాను భూరాజులు "సంఘము యొక్క కుమారులు".

5. అపవిత్ర కార్యములతో నిండియున్న సువర్ణ పాత్రను ఆ స్త్రీ చేతపట్టుకొని యుండెను (4వ). రోమన్ కేథలిక్కు సంఘము పాపక్షమాపణ పత్రములను, పరిహార పత్రములను విక్రయించుచు ప్రజలను తనవైపు బహుగా ఆకర్షించుకొన ప్రయత్నించును. తద్వారా పాపమునకు నడిపించును.

6. భూలోక వర్తకులు దాని సుఖభోగముల వలన ధనవంతులైరి (18:3). పాపక్షమాపణ పత్రములు, పరిహార పత్రములు అమ్ముట వలన అనేకులు ధనవంతులైరి. ఏ రకమైన పాపము చేసినను ఈ పత్రములను కొనుగోలు చేసిన యెడల ఆయపరాధమునుండి విడుదల యగుదురు.

7. దాని భద్రతయందు దానికి విపరీతమైన నమ్మకము కలదు (ప్రక 18:7). రోమన్ కేథలిక్కు సంఘము మరి యే సంఘమును గుర్తించదు. సరిగదా మిగతా సంఘములన్నీ తనలో విలీనమవునని నమ్మును.

8. అది తన్నుతాను అతి వైభవముగా అలంకరించుకొనును (ప్రక 17:4). రోమ్ పట్టణమునకు వెళ్లిన వాడెవడైనను యిది యదార్థమని చెప్పును. దాని శోభ, వైభవము, ఆడంబరము ఇంతా అంతాకాదు.

9. ఆ స్త్రీ పరిశుద్ధుల యొక్క రక్తముతో మత్తిల్లియుండెను (17:6). చరిత్ర పుటలు మనం తిరుగవేసిన యెడల ఎన్నో సంగతులు బయల్పడును. కేథలిక్కు సంఘము జరిపిన మతద్రోహుల విచారణలో (Inquisition)లక్షా యాభైవేలమంది ముప్పై సంవత్సరములలో హతులైరి. 1540లో

ఆరంభమైన జెసూయిట్స్ ఆర్డర్ (Jesuits order)వలన తొమ్మిది లక్షల మంది పోపుల క్రూరత్వము వలన నాశనమైరి (Halley, Page 884).

10.ఆమె ఏహ్యమైన వాటికి తల్లి (17:5). ఎంతైనా డబ్బుయిచ్చి కాలపరిమితి లేని పాపక్షమాపణ పత్రములు కొనుగోలు చేసుకొనవచ్చును. కేథలిక్కు స్వాముల దగ్గర పాపములు ఒప్పుకొనే పద్ధతి మరింత హీనమైనది.

11. ఆమె కూర్చుని యున్న మృగము దేవదూషణ నామములతో నిండుకొని యుండెను (17:3). పోపు పొరబడని వాడని (Infallible) ప్రకటించుకొనుటే దీనికొక గొప్ప ఉదాహరణ.

12.భూనివాసులు దానివలన పాపములోనికి నడిపించబడిరి (18:3). పోపుల సంఘము విగ్రహారాధనను ప్రవేశపెట్టి ప్రజలను పాపములోనికి నడిపించును. రోమన్ సంఘము యొక్క ఆరాధన అంతయు గొప్ప దేవత మూర్తి యొక్క అర్చనయే. అర్చన ప్రతిమలను ఎవరు ఆరాధించరో, ఘనపరచరో, పూజచేయరో అట్టివారు శాపగ్రస్థులని పోపుల యొక్క ఆదేశము. పాపక్షమాపణ పత్రముల విక్రయము వలన ప్రజలు దుర్నీతి లోనికి నడిపించబడిరి.

13.ఆ మృగము యొక్క రాజకీయ బలము పలు రాజ్యములకు వ్యాపించినను, "వారు ఆ వేశ్యను ద్వేషించి, దానిని దిక్కులేని దానిగాను దిగంబరిగాను చేతురు" (17:16). పోపుల యొక్క రోమా సార్వజనికంగా ద్వేషింప బడునదియే. అది రాజ్యములలో అలజడులను సృష్టించుశక్తియని ప్రతివారు భావింతురు.

14.అయినను ఈ బబులోనులో అంతము వరకు నమ్మకముగా యుండు పరిశుద్ధులుందురు. వారు పిలువబడినవారు, యేర్పరచబడిన వారు

(17:14). దాని ఏహ్యామైన కృత్యములను గూర్చి అజ్ఞానులైన వారనేకులు దానిలో యుందురు. కొందరు ఇప్పటికే దానిని విడిచి బయటకు వచ్చేసారు. మరికొందరు వస్తూనే యున్నారు.

# సింహాసనాసీనుడై యున్న దేవుడు

## (God on His Throne)

**మూలము : ప్రకటన గ్రంథము - 14వ అధ్యాయము**

వందలాది సంవత్సరముల క్రితము షేబ దేశపురాణి సొలొమోనును దర్శించుటకు వచ్చెను. అతని ధనసంపదలు గొప్పవి, అతని జ్ఞానము మితిలేనిది, అతని శక్తి మరింత గొప్పది. దీనినంతటినీ తన కన్నులారా ఆమె చూడగోరింది. ఆమె దేనిని విడువక సమస్తాన్ని చూచింది. సొలొమోను యొక్క సింహాసనాన్ని చూచేసరికి ఆమె ఎంత దిగ్భ్రాంతి చెందినదో మనం గమనించుకోవచ్చును. అటువంటిది మరి ఏ రాజ్యమందైనను చేయబడలేదు. ఆ సింహాసనము దంతము చేత చేయబడి బంగారముతో పొదగబడెను. ఆ సింహాసనమునకు ఇరుపార్శ్వముల యందు ఊతలుండెను. ఊతల దగ్గర రెండు సింహములు నిలిచి యుండెను. ఇరుప్రక్కల ఆరు మెట్ల మీద పండ్రెండు సింహములు నిలిచి యుండెను. (1రాజులు 10:18-20). ఆ సింహాసనము మీద రాజైన సొలొమోను ఆసీనుడై యుండెను! మహాజ్ఞాని, వాస్తుశాస్త్రజ్ఞుడు, నిర్మాణికుడు, సంగీతకారుడు, వృక్షశాస్త్రవేత్త, వర్తకుడు, జంతుశాస్త్రజ్ఞుడు, రాజకీయ ధురంధరుడు, రాజు !! తాను వినిన దానికంటె కనుగొనినది ఎంతో విస్తారమైనదని షేబరాణి గ్రహించి విస్మయమొందినది (1రాజులు 10:5).

మనల్ని ఆశ్చర్య చకితులను చేసి ఊపిరాడకుండా చేసే కొన్ని సంగతులు కలవు. దేవుడు తన సింహాసనాసీనుడై యుండగా పరలోక దృశ్యము ఆలాంటిదే. వర్ణింపనలవి కాని అందము, అత్యున్నతమైన మహిమాప్రభావము, భయంకరమైన

తీర్పునిచ్చే సింహాసనము సర్వశక్తిగల దేవుని సింహాసనము. ఆయన ఒక్కడు మాత్రమే పరిశుద్ధుడు. గనుక సర్వజనాంగములు ఆయనను ఆరాధింతురు.

సింహాసనాసీనుడై యున్న దేవుని ప్రాముఖ్యతను ప్రకటన గ్రంధము వివరించుచున్నది. పద్మాసు ద్వీపములో అపొస్తలుడైన యోహాను పరలోకములో ఒక ద్వారము తెరువబడి యుండుట చూచాడు. "వెంటనే నేను ఆత్మవశుడనైతిని. అదిగో పరలోకమందు ఒక సింహాసనము వేయబడి యుండెను. సింహాసనము నందు ఒకడు ఆసీనుడై యుండెను" (ప్రకటన 4:2). పరలోకమందు ఒక సింహాసన మున్నది! 4,5 అధ్యాయములలో దాన్ని గూర్చి 17 సార్లు చెప్పబడినది. ఆ సింహాసనము ఖాలీగా యేమీలేదు! దానిమీద ఒకాయన కూర్చొని యున్నాడు. ఆయనే పాలించువాడు, సర్వశక్తిగల ప్రభువైన దేవుడు !

సింహాసనాసీనుడై యున్న దేవుని గూర్చి మనం చెప్పుకోనేటప్పుడు, ప్రకటన గ్రంధములోని భాష అత్యంత అలంకార భాషయని మీకు గుర్తు చేయాలి. ప్రకటన గ్రంధమును చదువునప్పుడు అది మన కండ్ల యెదుటనే ఆవిష్కరింపబడుచున్న యొక గొప్ప దృశ్యమని గుర్తుంచుకోవాలి. ప్రకటన గ్రంధము మనకు కనుపించేలాగున వర్ణించబడింది. "నాతో మాటలాడుచున్న స్వరమేమిటో యని చూడ తిరిగితిని" (ప్రకటన 1:12).

## మనోహర సింహాసనము

దేవుని సింహాసనము మనోహర సింహాసనము. మరకతము వలె ప్రకాశించు ఇంద్రధనస్సు సింహాసనమును ఆవరించి యుండెను. ఆ సింహాసనము నుండి మెరుపులును, ధ్వనులును, ఉరుములును బయలుదేరుచుండెను. మరియు ఆ సింహాసనము ఎదుట ఏడు దీపములు ప్రజ్వలించుచుండెను. అవి దేవుని యేడు ఆత్మలు, సింహాసనము చుట్టు ఇరువది నాలుగు సింహాసనములుండెను. ఈ సింహాసనములందు ఇరువది నలుగురు పెద్దలు తెల్లని వస్త్రములు ధరించుకొని,

సువర్ణ కిరీటములు ధరించుకొని యుండిరి. సృజింపబడిన అన్ని జీవరాశులు ప్రతినిధులుగా నాలుగు జీవులక్కడ యుండెను. ఈ నాలుగు జీవులలో ప్రతి దానికి ఆర్నేసి రెక్కలుండెను. అవి -భూత వర్తమాన భవిష్యత్కాలములలో ఉండు సర్వాధికారియు దేవుడునగు ప్రభువు పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు అని మానక రాత్రింబగళ్లు చెప్పుచుండెను.

ఆ సింహాసనము మధ్యను వధింపబడినట్లుండిన గొర్రెపిల్ల నిలిచి యుండెను. ఆ గొర్రెపిల్లకు ఏడు కొమ్ములును, ఏడు కన్నులుండెను. ఆ కన్నులు భూమి యందంతటికిని పంపబడిన దేవుని యేడు ఆత్మలు. ఆ నాలుగు జీవులును ఇరువది నలుగురు పెద్దలును ఆ గొర్రెపిల్ల యెదుట సాగిలపడిరి. వారు వీణెలను, ధూప ద్రవ్యములతో నిండియున్న సువర్ణపాత్రలను పట్టుకొని యుండిరి. ఈ పాత్రలు పరిశుద్ధుల ప్రార్ధనలు, వారు పాడుటకు మొదలిడిరి.

మనకు అనేక దూతల స్వరము వినబడును. వారి లెక్క కోట్లకొలది యుండెను. వారు గొర్రెపిల్లకు స్తోత్రములు చెప్పుచున్నారు. మరియు ఆ సింహాసనము ఎదుట స్ఫటికమును పోలిన గాజువంటి సముద్రమున్నట్లుండెను. మనం ఎటు చూచినా, అందము, మనోహరము, సౌందర్యము, మహిమయే కనబడును! (ప్రక **4-5** అధ్యా).

## శక్తి గల సింహాసనము

దేవుడు సింహాసనాసీనుడై యున్నాడు. ఆయన తన విశ్వాన్ని యేలు చున్నాడు. భూలోక శక్తులు ఎంత భయంకరంగా, క్రూరంగా కనబడినా, అవిఆయన యెదుట నిలువనేరవు. ఈ లోకం దానికదే విడిచిపెట్టబడలేదు. దానినేదో ఒక అగోచరశక్తి పాలించుటలేదు. ఎవరో ఒకరు దీనిని తన కంట్రోలులో ఉంచుకొని యున్నారు. ఆయన కైసరు కాదు, అమెరికా అధ్యక్షుడు కాదు. యే మానవ మాత్రుడు కాదు. డొమేషియన్ చక్రవర్తి తాను "ప్రభువును దేవుడనని" పిలిపించు

కొన్నాడు గాని నిజానికి ఆ బిరుదు వేరొకనిది. ఈ లోకరాజులు తమ రాజ దండములను నీరో చక్రవర్తికి సమర్పించవచ్చునేమో గాని, సర్వశక్తి గల దేవుని యెదుట సమర్పించబడే సువర్ణ కిరీటముల యెదుట అవి యెందుకు పనికిరావు. దేవుడు సమస్తాన్ని తన అదుపులో ఉంచుకొనియున్నాడు. పరలోక సింహాసనాసీనుని యెదుట భూరాజుల సార్వభౌమత్వము అర్థరహితమైనదే. అత్యంత ఘనంగా ఆయన ఒక్కడు మాత్రమే పాలించుచున్నాడు. ఆయన మాట్లాడగా జనములు లేచును. ఆయన మాట్లాడగా జనాంగములు కూలద్రోయ బడును. అవి కుమ్మరి చేతిలోనున్న మన్నువంటివే (యిర్మియా 18:1-10). కానాను దేశరాజులను ఓడించుటకు, బబులోను బలమును కూలద్రోయుటకు, రోమా చక్రవర్తిని మట్టి కరిపించుటకు దేవునికి శక్తియున్నది. "యెహోవా, భూమ్యాకాశముల యందుండు సమస్తమును నీ వశము; మహాత్మ్యమును పరాక్రమమును, ప్రభావమును, తేజస్సును, ఘనతయు నీకే చెందుచున్నవి; యెహోవా రాజ్యము నీది, నీవు అందరి మీదకు నిన్ను అధిపతిగా హెచ్చించుకొనియున్నావు" (1దినవృ. 29:11).

సర్వశక్తి దేవునికి కలదు. ఆయనకు సమస్తమును సాధ్యమే. మిగిలిన అన్ని శక్తులను ఆయనే సృజించెను. ప్రకృతి శక్తులు, ప్రధానులు, అధికారులు, గోచరమవునవేమి, అగోచరమవునవేమి అన్నియు ఆయన సార్వభౌమత్వానికి తలవొగ్గవలసినదే.

హింసల మధ్య క్రైస్తవులు సింహాసనాసీనుడైయున్న తమ దేవుని బట్టి ధైర్యము పొందుదురు. రోమా సైన్యములు అతి ఘోరముగా హింసింపవచ్చును. అజేయులుగా వారు కనబడవచ్చును గాని క్రైస్తవులు దేవుని తట్టు తిరిగి రాజ్యమును, పరాక్రమమును, ప్రభావమును, తేజస్సును నిరంతరము నీకే చెందునని చెప్పగలరు.

# 16.

## న్యాయము తీర్పుల సింహాసనము

దేవుని యేలుబడిలో న్యాయము, తీర్పు యిమిడియున్నవి. "సర్వలోకము నకు తీర్పు తీర్చువాడు న్యాయము చేయడా ?" (ఆది. 18:25). సొదొమ గొమొఱ్ఱాలను గూర్చి బ్రతిమలాడుచు అబ్రాహాము అడిగిన ఆ ప్రశ్నకు ప్రకటన గ్రంధములో జవాబు దొరుకుచున్నది.

దుష్టత్వానికి శిక్ష విధించబడాలి. దేవుని చేతిలో ఒక గ్రంధపు చుట్టయున్నది. గొర్రెపిల్ల ఆ గ్రంధపు ముద్రలు విప్పినప్పుడు, నాలుగు గుర్రములపై ఆసీనులై యున్న వారు స్వారీచేయాలి, ఓటమి, కరువు, మరణము సంభవించుచుండగా మనం ఆశ్చర్య చకితులమై దీనినంతా లిఖిస్తాము. ఏడు బూరలు ఊదబడును. అప్పుడు అగ్ని, వడగండ్లు, కురియును, చివరకు సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు కూడ కంపించును. పరలోకములో యుద్ధము జరిగినందున దుష్టత్వము బయలుపర్చబడెను. మరియు ఆ గొప్ప క్రూరమృగము పడద్రోయ బడెను. మరియు సముద్రమునుండి యొక మృగము దానికి నిశ్చయంగా సంభవించు అంతము కొరకు లేచును. మరియు ఏడు పాత్రలు చేతపట్టుకొని యున్న ఏడు దూతలు కనబడుదురు. ఆ యేడు పాత్రలు దేవుని కోపముతో నిండియున్న ఏడు తెగుళ్ళు. అవి భూమి మీద కుమ్మరించబడును. క్రూర మృగముపై యున్న వేశ్య నాశనమునకు పోవును. మహా బబులోను నాశనమయ్యెను. మరియు అగ్ని గంధకములతో మండు గుండములో అబద్ధ ప్రవక్తయు, క్రూరమృగమును పడద్రోయబడును. సాతానుడు బంధింపబడి అగాధములో పడద్రోయబడును. గోగు, మాగోగులు ఓడిపోయిరి. అందరును ఆ గొప్ప ధవళ సింహాసనము యెదుట నిలువగా అందరికీ తీర్పు వచ్చును. "వారిలో ప్రతివాడు తన క్రియల చొప్పున తీర్పు పొందెను" (ప్రక 20:13).

"యెహోవా రాజ్యము చేయుచున్నాడు, భూలోకము ఆనందించును గాక... నీతి న్యాయములు ఆయన సింహాసనమునకు ఆధారము" (కీర్తన 97:1,2).

దుష్టులు శిక్షింపబడుదురు, నీతిమంతులు ప్రతిఫలము పొందుదురు. ఆలోచన, విచక్షణ గలిగిన వ్యక్తికి యిది ఎంత మధురమో! ఈ లోకంలో మనచుట్టూ అక్రమము, బలత్కారము, హింస, విచారము చూస్తూనే యున్నాము. దుష్టులు అభివృద్ధి చెందుట, నీతిమంతులు హింసలు పొందుట విధిగా జరుగుట మనమెరుగుదుము. "నాధా, సత్యస్వరూపీ, పరిశుద్ధుడా, యెందాకా తీర్పు తీర్చకయు మా రక్తము నిమిత్తము భూనివాసులకు ప్రతిదండన చేయకయు ఉందువని" బిగ్గరగా కేకలు వేయుట జరుగును (ప్రక 6:10). అయితే ఎల్లప్పుడు అట్లుండదు. ఏలయనగా దేవుడు తన సింహాసనము మీద కూర్చొనియున్నాడు.

## కృపాసింహాసనము

దేవుని సింహాసనము కృపాసింహాసనము. విమోచింపబడిన వారందరు తెల్లని వస్త్రములు ధరించుకొనియుండుట చూడు. దేవుని కృప యొక్క నిదర్శనము తప్పక చూడగలవు. కృపవలన ఆయన నూతన ఆకాశమును, నూతన భూమిని కలుగజేయును. "ఇదిగో సమస్తమును నూతనముగా జేయుచున్నాను" అది నూతనమైనందున నీవు సంతోషించవా ? అక్కడ మానవుని క్రూరత్వము గాక దేవుని మంచితనమే ప్రత్యక్షమగును.

అక్కడ సహవాసము ఎంత పరిపూర్ణమైనదో గదా! దేవుని కృపవలన అక్కడ భద్రత గలదు. ఆ పట్టణము చుట్టు ప్రహరి గోడయున్నది. దానిలో రాత్రిలేదు, చీకటిలేదు. ఏలయనగా దేవుడే దానికి వెలుగైయున్నాడు.

పరలోకము చచ్చవుక(Four square) మైనది. అది దాని పరిపూర్ణతకు చిహ్నము. అది ఆనందముతోను, తేజస్సుతోను నిండిన పట్టణము. ఈ దృశ్యాన్ని వర్ణించదగిన భాషలేదు. బంగారు వీధులు, ముత్యములతో పొదగబడిన గుమ్మములు, వెలగల రాళ్లు, ఇవన్నీ ఊహించుకో. ఎంత అందమైన పట్టణమో !

ప్రతి అవుసరము అక్కడ తీర్చబడును. స్ఫటికము వలె మెరయునట్టి జీవ

జలముల నది దేవుని సింహాసనమునుండి ప్రవహించును. నెలనెలకు పండ్రెండు కాపులు కాయు జీవవృక్షము అక్కడున్నది. దాని ఆకులు జనములను స్వస్థపరచుటకై వినియోగించబడును. అక్కడ ఆకలి దప్పులుండవు. దేవుడే వారి కన్నుల ప్రతి బాష్ప బిందువును తుడిచివేయును (ప్రక 22:1,2; 7:17). ఈ దేవుని కృపను బట్టి మనం స్తుతిగానము చేయబద్ధులము!

## ఆరాధనా సింహాసనము

ఆయన దాసులు ఆయనను సేవింతురు (ప్రక 22:3). పరలోకారాధన భయభక్తులతో కూడినది. "దేవదూతలందరును సింహాసనము చుట్టును పెద్దల చుట్టును ఆ నాలుగు జీవుల చుట్టును నిలువబడియుండిరి. వారు సింహాసనము ఎదుట సాష్టాంగపడి-ఆమేన్: యుగ యుగముల వరకు మా దేవునికి స్తోత్రమును, మహిమయు, జ్ఞానమును, కృతజ్ఞతాస్తుతియు, ఘనతయు, శక్తియు బలమును కలగును గాకని చెప్పుచు దేవునికి నమస్కారము (ఆరాధన) చేసిరి" (ప్రక 7:11,12).

పరలోకారాధన స్తోత్రముతో నిండియుండునట్టిది. "వారు-ప్రభువా, దేవా, సర్వాధికారీ, నీ క్రియలు ఘనమైనవి, ఆశ్చర్యమైనవి; యుగములకు రాజా, నీ మార్గములు న్యాయములును సత్యములునై యున్నవి ! ప్రభువా నీవు మాత్రము పవిత్రుడవు. నీకు భయపడని వాడెవడు ? నీ నామమును మహిమ పరచని వాడెవడు ? నీ న్యాయవిధులు ప్రత్యక్ష పరచబడునవి గనుక జనములందరు వచ్చి నీ సన్నిధిని నమస్కారము (ఆరాధన) చేసెదరని చెప్పుచు దేవుని దాసుడగు మోషే కీర్తనయు, గొర్రెపిల్ల కీర్తనయు పాడుదురు" (ప్రక 15:3-4).

పరలోకారాధన హృదయ పూర్వకమైనది. కూడివచ్చిన జనసమూహములో గొప్ప సంతోషానందములు ఉప్పొంగును. గొప్ప జన సమూహము "ప్రభువుని స్తుతించుడి. రక్షణ మహిమ ప్రభావములు మన దేవునికే చెందును" అని చెప్పుదురు (ప్రక 19:1).

పరలోకారాధన ఎడతెగనిది. "అందువలన వారు దేవునికి సింహాసనము ఎదుట ఉండి రాత్రింబగళ్లు ఆయన ఆలయములో ఆయనను సేవించుచున్నారు" (ప్రక 7:15). కాలమానమును బట్టి వారి ఆరాధన యుండదు గాని ఎడతెగని వారి హృదయ తత్వమును బట్టి యుండును.

ఆరాధనను ఏ మానవుడు కించపరచరాదు. మానవుడు దేవుని పవిత్రత కొరకు ఆయనను సమీపించవలసినదే. మనము దేవుని దగ్గరకు తిరిగి రావాలి. లేదా అంతరంగ మరణాన్ని అంగీకరించాలి! ఆరాధన లేకుండా ప్రజలు జీవించలేరు. వారు మరణిస్తారు! వారు తమ కంటె ఉన్నతుని ఆరాధించుటకు మానినప్పుడు తమకంటె అధోగతి పాలవుదురు.

**ముగింపు**

దేవుని సింహాసనము యేమి సింహాసనమో ! అది మహిమ మనోహరము శక్తి గల సింహాసనము. అది న్యాయము తీర్పుల సింహాసనము. అది కృపారాధనల సింహాసనము. అది దేవుని సింహాసనము ! మనమాయనను అక్కడ చూడగలిగితే మన విజయాన్ని కండ్లార చూడగలము.

మహిమ గల ఆ రాజును ఒకానొక దినమందు మనము చూతుము. ఒకానొక దినమందు ఆయన సింహాసనము చుట్టుయుండి ఆరాధింతుము. ఒకానొక దినమందు మనం "యుగయుగములు రాజ్యము చేతుము" ( ప్రక 22:5). అది ఎంత ధన్యకరమైన దినమో ! ఆ దినము వరకు మన విశ్వాసము, ఐక్యత, ఆరాధనలు ఎడతెగరాదు !!

- జాన్ డి గిబ్సన్.

20.

# క్రీస్తుని గూర్చి మీకేమి తోచుచున్నది ?

## (What Think Ye of Christ ?)

యేసుక్రీస్తు ఈలోకమందు ఉద్భవించినది మొదలుకొని ఆయన యెవరు? అనే ప్రశ్నను ప్రతివారు ఎదుర్కొనవలసి వచ్చుచున్నది. ఈలోకమందు సంచరించిన అనేక మతగురువులవలె గాక యేసు యొక్క నామము ప్రతివానిలోను వివిధ భావములను రేకెత్తించుచున్నది. ఇది చాల ప్రాముఖ్యమైన ప్రశ్న, విశ్వాసమునకది మూలరాయివంటిది (యెష 28:16). మానవుడు క్రీస్తుని గూర్చి ఏమి తలంచుచున్నాడో దానిని బట్టి అతని ఆత్మ యొక్క గమ్యస్థితి యుండును. అందుకే "నేను ఆయనని (అనగా దేవుని కుమారుడనని) మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములలోనే యుండి చనిపోవుదురని" యేసు చెప్పెను (యోహాను 8:24).

"ఒకప్పుడు పరిసయ్యులు కూడియుండగా యేసు వారిని చూచి క్రీస్తుని గూర్చి మీకేమి తోచుచున్నది ? ఆయన ఎవని కుమారుడని అడిగెను. వారు- ఆయన దావీదు కుమారుడని చెప్పిరి" (మత్తయి 2:41,42). శరీరమును బట్టి యేసుక్రీస్తు దావీదు కుమారుడయ్యెను (రోమా 1:7). ఆయన తల్లియైన మరియ మనుష్య మాత్రురాలు గనుక ఆయన మనుష్యకుమారుడాయెను. క్రీస్తు శరీర ధారియై మనమధ్య నివసించెను (యోహాను 1:14). ఆయన దైవమానవత్వమును కలిగియుండుట వలన మానవుల రక్షకునిగాను, దేవుని సన్నిధానమున వారి మధ్యవర్తిగాను ఉండుటకు అవకాశమేర్పడెను (1తిమో 2:5,6). మనుష్యకుమారుని వలె క్రీస్తు శోధింపబడెను. ఆకలి దప్పికల ననుభవించెను, శ్రమలను, బాధలను భరించెను. మానవులందరికంటె ప్రార్థనావశ్యకతను కలిగియుండెను. అయితే ఆయన కేవలము మానవమాత్రుడు కాడు.

## దేవుని అద్వితీయ కుమారుడు

యేసుక్రీస్తు దేవుని అద్వితీయ కుమారుడై యుండెను. యేసు దావీదు కుమారుడని పరిసయ్యులు చెప్పినది సత్యమే గాని, అది పరిపూర్ణ సత్యము కాదు. క్రీస్తు కేవలము మానవుడే అయితే దావీదు ఆయనను ప్రభువని ఏల సంబోధించెనని యేసు వారినడిగెను. క్రీస్తు దావీదునకు ముందునుండియే యుండెను. నిజానికి ఆయన లేని సమయమంటు ఎన్నడూ లేనేలేదు (యోహాను 1:1, 8:58). ఆయన అల్ఫాయు, ఓమేగయు, ఆదియు అంతమునై యున్నాడు (ప్రకటన 1:8). కాలారంభము కాకముందునుండియే క్రీస్తు ఉండెను. కాలాంతము అయిపోయినను కూడ ఆయన ఉండును.

క్రీస్తు దేవుని యొక్క ఏకైక కుమారుడు. పరిశుద్ధాత్ముని శక్తి వలన ఆయన ఒక కన్యకు జన్మించెను. ఆయన తండ్రి దేవుడు గనుక ఆయన దైవత్వము కలిగి దేవుని కుమారుడై యుండెను. ఆయన ఇమ్మానుయేలని పిలవబడెను. ఇమ్మానుయేలనగా దేవుడు మనకు తోడనియర్థము (మత్తయి 1:23). ఆయన శరీరధారియైన దేవుడు. "నిరాక్షేపముగా దైవభక్తిని గూర్చిన మర్మము గొప్పదై యున్నది; ఆయన సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యెను. ఆత్మ విషయమున నీతి పరుడని తీర్పునొందెను. దేవదూతలకు కనబడెను. ఆరోహణుడై తేజోమయు డయ్యెను" (1తిమో 3:16). అందువలననే యేసు "నన్ను చూచినవాడు తండ్రిని చూచి యున్నాడని" చెప్పగలిగెను (యోహాను 14:9). ఆయన దేవుని మహిమయొక్క తేజస్సును, ఆయన తత్వముయొక్క మూర్తిమంతమునై యుండెను (హెబ్రీ 1:3).

### అనేకుల సాక్ష్యములు

యేసు దేవుని కుమారుడని సాక్ష్యము పొందెను. యేసు యొర్దాను నదిలో యోహానుచేత బాప్తిస్మము పొందగా ఇదిగో ఈయన నా ప్రియ కుమారుడని తండ్రియైన దేవుడు ఆకాశమునుండి సాక్ష్యమిచ్చెను (మత్తయి 3:16,17). మరల యేసు ఒక కొండమీద రూపాంతరము పొందగా అదే సాక్ష్యపు పలుకులను దేవుడు ఆయనను గూర్చి మరల పలికెను (మత్తయి 17:1-5). యేసుయొక్క

శిష్యులు కూడ ఆయన నిజముగా దేవుని కుమారుడని చెప్పి ఆయనకు మ్రొక్కిరి (మత్తయి 14:34). దయ్యములు పట్టిన మనుష్యులు కూడ యేసు దేవుని కుమారుడని సాక్ష్యమిచ్చిరి (మత్తయి 8:29). ఆయన దేవుని కుమారుడని చివరకు అపవాదికూడ ఒప్పుకొనెను (మత్తయి 4:3). అంతేకాదు యేసును సిలువవేసిన సైనికులు సహా "నిజముగా ఈయన దేవుని కుమారుడని చెప్పుకొనిరి" (మత్తయి 27:54).

క్రీస్తు దేవుని కుమారుడని తనను గూర్చి తాను చెప్పుకొనెను (మత్తయి 27:48). నేటి వేదాంతులు ఆయన ఒక సత్పురుషుడే గాని దేవుని అద్వితీయ కుమారుడు కాడని చెప్పుదురు. సత్పురుషులు అబద్ధమాడజాలరు. ఆయన దేవుని కుమారుడు కానియెడల సత్పురుషుడెట్లు కాగలడు ? ఆయనను గూర్చి నీకేమి తోచుచున్నది ? ఆయన దేవుని కుమారుడని నైనేనను సోచించుచున్నది. అయితే నీ యభిప్రాయమేమిటి ? ఆయన యెవరి కుమారుడు ?

## మిన్నయైన బోధకుడు

యేసు చేసిన బోధలు ఆయన దేవుని కుమారుడని సాక్ష్యమిచ్చుచున్నవి. ఆయన ప్రజలకు బోధించినప్పుడు వారి శాస్త్రులవలె గాక అధికారము గల వానివలె వారికి బోధించెను (మత్తయి 7:29). ఆయనలో సహజముగా యున్న అధికారము ను బట్టి మానవులకంటె ఉన్నతునిగా ఆయన అగుపడెను. ఆయన భవిష్యత్తును సంపూర్ణముగ ఎరిగిన వానివలె ఖచ్చితముగా బోధించెను. మనుష్యుల అంతరంగిక స్వభావమును ఆయన ఎరిగియుండెను. అందువలన ఆయన మానవులకంటె మిన్నయైనవాడని నిరూపించుకొనెను. యేసు అందరిని ఎరిగినవాడు. ఆయన మనుష్యుని ఆంతర్యమును ఎరిగినవాడు. గనుక యెవడును మనుష్యునిగూర్చి ఆయనకు సాక్ష్యమియ్యనక్కరలేదు అని యోహాను 2:24, 25లో వ్రాయబడి యున్నది.

యేసు చేసిన బోధఅంతయు సంపూర్ణమైనది, శ్రేష్ఠమైనది. ఆయన బోధలను వేదాంతులు, విగ్రహారాధికులు, దేశనాయకులు, యూదులు, క్రైస్తవులు మొదలుగు వారనేక రీతులుగ పరిశోధించుచునే యున్నారు. అయితే నేటివరకు ఏ మానవుడు

కూడ ఆయన బోధలో దోషమున్నట్లు చెప్పలేక పోవుచున్నాడు. అందుకే యూదుల ప్రధాన యాజకులు పరిసయ్యులు యేసును పట్టుకొనుడని కొందరు బంట్రోతులను పంపితే వారాయనను పట్టుకొనలేదు సరిగదా ఆ మనుష్యుడు మాటలాడినట్లు ఎన్నడును మాటలాడలేదని సాక్ష్యమిచ్చిరి (యోహాను 7:46).

## ఆశ్చర్యకరమైన క్రియలు

యేసు చేసిన క్రియలు ఆయన దేవుని కుమారుడని నిరూపించుచున్నవి. "నేను నా తండ్రి క్రియలు చేయనియెడల నన్ను నమ్మకుడి, చేసిన యెడల నన్ను నమ్మకున్నను తండ్రి నాయందును నేను తండ్రియందును ఉన్నామని మీరు గ్రహించి తెలుసుకొనునట్లు ఆ క్రియలను నమ్ముడని" క్రీస్తు బోధించెను (యోహాను 10:38). ప్రకృతిశక్తుల మీద ఆయన అధికారము కలిగియుండెను. ఆయన తుఫానును గద్దింపగా గాలి, సముద్రము నిమ్మళమాయెను (మత్తయి 8:28-27). ఆయన నీటిపై నడచెను, నీళ్ళను ద్రాక్షారసముగ మార్చెను.

మనుష్యులను పీడించు వ్యాధులపై ఆయన అధికారము కలిగియుండెను. కుష్ఠరోగి ఒకడు వచ్చి ఆయనకు మ్రొక్కి ప్రభువా, నీకిష్టమైతే నన్ను శుద్ధునిగా చేయగలవనెను. అందుకాయన చెయ్యిచాపి వానిని ముట్టి నాకిష్టమే, నీవు శుద్ధుడవు కమ్మని చెప్పగా తక్షణమే వాని కుష్ఠరోగము శుద్ధియాయెను (యోహాను 8:2-4). పండ్రెండు సంవత్సరములనుండి రక్తస్రావముచే బాధపడుచున్న స్త్రీ యొకతి ఆయన వస్త్రపు చెంగు ముట్టెను. యేసు వెనుకకు తిరిగి ఆమెను చూచి కుమారీ, ధైర్యముగా ఉండుము, నీ విశ్వాసము నిన్ను బాగుపరచెనని చెప్పగా, ఆ ఘడియనుండి ఆ స్త్రీ బాగుపడెను (మత్తయి 9:20-22).

రోగమే కాదు, మరణము కూడ క్రీస్తుకు లోబడెను. ఆయన చనిపోయిన లాజరును మరల బ్రదికించెను. యేసు అనేక అద్భుతములను చేసెను. వాటిలో కొన్ని మాత్రమే క్రొత్తనిబంధనలో వ్రాయబడెను. మనము యేసునందు విశ్వాసముంచ గల్గునట్లు అవి వ్రాయబడెను (యోహాను 20:30,31). యేసును గూర్చి బైబిలునందు వ్రాయబడిన సంగతులను మనము నిరభ్యంతరముగా

నమ్మవచ్చును. బైబిలును వ్రాసిన లేఖకులు దేవుని ఆత్మచే నడిపింపబడిరి. సరిగదా వారు ఏది వింటిరో, కన్నులారా ఏది చూచితిరో, నిదానించి ఏది కనుగొంటిరో, వారి చేతులు దేనిని తాకి చూచెనో దానిని గూర్చి వారు వ్రాసిరి. అంతేకాదు ఆ లేఖకులు తాము విశ్వసించిన వానికొరకు తమ ప్రాణములను కూడ అర్పించిరి. గనుక వారిచ్చిన సాక్ష్యము యధార్ధమని మనమంగీకరించవచ్చును.

క్రీస్తు ఈలోకమునందుద్భవించినది మొదలుకొని చరిత్రయొక్క గతియే మార్చబడినది. కాలము ఆయన రాకడను బట్టి లెక్కింపబడుచున్నది. నాటినుండి నేటివరకు ఆయన నామము లోకమందంతట ప్రకటింపబడుచుండగా కోట్లకొలది ప్రజలు ఆయన దేవుని కుమారుడని విశ్వసించి ఆయనకు విధేయులగుచున్నారు. మిత్రుడా, క్రీస్తుని గూర్చి నీకేమి తోచుచున్నది ? ఆయన దేవుని కుమారుడని నిరూపించు అనేక ఋజువులను ఈనాడు నీకు చూపించితిని. నీవు నీ పాపముల నుండి విముక్తుడవు కావలెనంటే యేసునందు విశ్వాసముంచుము. పాపముల విషయమై మారుమనస్సు నొందుము. క్రీస్తు నామమును బహిరంగముగా ఒప్పుకొనుచు, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. క్రీస్తే దేవుని కుమారుడని లోకానికి ప్రకటించుచూ ఆనంద జీవితమును జీవించుము !

- జాషువా గూటం.


**Bill & Sharon Paxton Children Home**

క్రీస్తు సంఘాలలో 5 నుండి 12 సంవత్సరముల వయస్సు ఉన్న నిరుపేదలు, అనాధలైన పిల్లల నుండి అడ్మిషన్లు కోరబడుచున్నవి. ఉచిత భోజనము, విద్య, క్రమశిక్షణతో కూడిన దైవభక్తి నేర్పబడును.

సంప్రదించవలసిన చిరునామా :

Bro. ఎ. విశ్వేశ్వరరావ్, క్రీస్తుసంఘము

ఆరికిరేవుల పోస్టు, కొవ్వూరు; ప॥గో॥జిల్లా

ఫోన్ : 08813 - 32550 / 31021

(కురెళ్లగూడెం), టి.ప్రసాదరావ్ (మైలవరం) మరియు జాషువా గూటం గార్లు సవిస్తరముగా బోధించిరి.

భోజనానంతరం మధ్యాహ్నకాల కూటము కె.జాన్ బెర్నార్డ్ గారి ప్రార్ధనతో ఆరంభమాయెను. సోదరులు పి.షద్రక్ గారు, కేసరపల్లి, పెద అవుటపల్లి క్రీస్తు సంఘస్థులు నిర్విరామకృషి చేసి వచ్చిన వారికి మంచి భోజన పానాదుల నేర్పరచిరి. వారికి విజయవాడ ధర్మాపురం క్రీస్తుసంఘము సహాయ సహకారముల నందించుటలో ముందుండిరి. షద్రక్ గారి వందన సమర్పణ తరువాత కె.రాజ్‌కుమార్ (విజయవాడ) గారి ప్రార్ధనతో సదస్సు ముగిసెను. సదస్సు జరిగిన వేళ అంతయు దేవుడు మంచి వాతావరణము ననుగ్రహించెను. సదస్సు ముగిసిన అరగంటలోనే కుండపోతగా వర్షము కురిసెను.

క్రొత్తనిబంధన ఆరాధనలో వాద్యములు దైవానుమతి బడసినవి కావు. వాటినుపయోగించువారు క్రీస్తుయొక్క అధికారము లేకుండానే వాడుచున్నారు. పాతనిబంధనలో కూడ వాద్య సంగీతము మానవ కల్పితమే. దేవుడు పశుబలులను, సాంబ్రాణి పొగలను ఎట్లు కోరుకొనుటలేదో అట్లే వాద్యములను కూడ కోరుకోనుట లేదు. "నీవు బలిని కోరువాడవు కావు, కోరిన యెడల నేను అర్పించుదును, దహన బలి నీ కిష్టమైనది కాదు, విరిగిన మనస్సే దేవుని కిష్టమైన బలి" యని దావీదు వ్రాసెను (కీర్తన 51:16,17). అందువలన "ప్రభువా నా నోరు నీ స్తుతిని ప్రచురపరచునట్లు నా పెదవులను తెరువుము" అని అతడు వ్రాసెను (కీర్తన 51:15). అసలు మానవ చరిత్రలో వాద్య సంగీతము కయీను సంతతి వలన కలిగెను (ఆది.కా. 4:16-24). కయీను సంతతి వలన నరహత్య, బహు భార్యాతత్వము, వాద్య సంగీతము ఆరంభమాయెను. యివి శరీరేచ్ఛలే. అయితే దేవునినారాధించు వారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెను. క్రొత్త నిబంధన ఆరాధనలో యాంత్రిక సంగీతము గాక, ఆత్మ సంబంధమైన గాత్ర సంగీతమును దేవుడు కోరుచున్నాడు (హెబ్రీ 13:5). పాతనిబంధన కాలములో కయీను సంతతివలె క్రొత్తనిబంధన ఆరాధనలో కేథలీక్కులు వాద్య సంగీతము ప్రవేశపెట్టిరి. వాద్య సంగీతము యొక్క పరిణామాలు ఏమంత కొనియాడతగినవి కావని సోదరులు హెచ్చరించిరి.

జూన్ 29వ తేదీ మంగళవారం సాయంత్రం కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ ఆవరణలో "Restoration Messenger" (పునరుద్ధరణ దూత) అను ద్వైమాస పత్రిక ఆవిష్కరింపబడెను. సోదరులు బొంతు ధనరాజు గారు (అమలాపురం) ముఖ్య అతిధులుగా వచ్చి, మంచి ఆత్మీయ సందేశమునిచ్చి పత్రికను విడుదల చేసిరి. సోదరులు టి.వి.యన్. కుమార్ (కాకినాడ), బి. ఆల్‌ఫ్రెడ్ (విశాఖపట్నం), జాషువా గూటం గార్లు క్లుప్త వాక్య పరిచర్య చేసిరి. పునరుద్ధరణ దూత ఎడిటర్ నెహెమ్యా గూటం గారు వందన సమర్పణ చేయగా అల్పాహార విందుతో నాటి కూటము ముగిసెను. పునరుద్ధరణ దూత వలయువారు ఆ పత్రిక ఎడిటర్ నెహెమ్యా గూటం, పి.ఒ. బాక్స్ నం. 57, కాకినాడ -533 001 కు వ్రాసి ఉచితముగా పొందవచ్చును.

ఉభయగోదావరి జిల్లాల సువార్తికుల సదస్సు జూలై 23వ తేదీ శుక్రవారం, కాకినాడ సత్యవాణి బిల్డింగ్‌లో జరుగును.

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani-Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada - 533 004.
Editor : Joshua Gootam

RNI Regd. No. 69973/98
PRINTED BOOK - BOOK POST

From:
SATYA VAKKU
P.O. BOX 80,
KAKINADA - 533 001

To